# ధర్మం - నాలుగో పాదం

న్యాయస్థానం అంతా విశ్శబ్దంగా ఉంది. న్యాయాధిపతి తీర్పు చదవడం మొదలు పెట్టాడు.

"మనం దేశ సేవకులం. దేశ రక్షణ మన విధి. మనకు తెలిసిన చట్టమల్లా ఒకటే. ఆజ్ఞాపాలన. మన యిష్టాయిష్టాలకు వ్యక్తిగత అభిప్రాయాలకు తావులేదు.'

పై అధికారి ఇచ్చిన ఆజ్ఞను శిరసా ధారయామిల అనుకుని ఆచరణలో పెట్టడమే తప్ప వేరే మార్గం లేదు.

మనకు యిష్టం లేకపోయినా, మనకు నచ్చకపోయినా, పై అధికారుల ఆజ్ఞను తిరస్కరించే అధికారం గాని, అవకాశం గాని మనకు లేవు.

విశ్వాసానికి, విధేయతకు గుర్తింపు ప్రతిఫలం, కీర్తి ఘనంగా ముట్టినట్టుగానే ఆజ్ఞాధిక్కారానికి దండన కూడా కఠినంగానే ఉంటుంది.

మిలటరీలో పనిచేసే ప్రతి వ్యక్తికి యీ విషయం తెలుసు.

ఆజ్ఞా ధిక్కారము చేసినవాడు శిక్షను అనుభవించవలసిందే!!

నీవు దోషివని బుజువైంది. నీకు శిక్ష విధించే ముందు యీ న్యాయస్థానం ఈ దేశానికి యింతవరకు నువ్వు చేసిన సేవలను, నీలోని నీతి నిజాయితీలను, పరోపకారబుద్ధి, ఆధ్యాత్మిక చింతనను దృష్టిలో ఉంచుకొని నీ పట్ల ఉదారంగా ప్రవర్తిస్తూ సానుభూతితో నీకు విధించవలసిన శిక్షను నిర్ణయించింది!

చట్టం కంటే ఎవ్వరూ ఎక్కువ కాదు కాబట్టి అన్ని విషయాలు తెలిసే, కావాలని నేరం చేసిన వ్యక్తికి చట్టం విధించే శిక్షను రద్దు చేసే అధికారం మాకు లేదు కాబట్టి నీకు యీ శిక్షలను విధిస్తున్నాము.

మొదట నీకు ఆరు నెలల కారాగార శిక్ష. ఇప్పటికి ఎనిమిది నెలలుగా జైలులో వున్నందున యీ శిక్ష నువ్వు అనుభవించినట్టుగా పరిగణించడమైనది.

రెండవది - నువ్వు నీ సర్వీసులో యింత వరకు పొందిన బిరుదులను, బహుమతులను రద్దు చేస్తున్నాం. బంగారు పతకాలను తిరిగి తీసేసుకుంటున్నాము.

ఇంతవరకు ధనరూపంలో యిచ్చిన బహుమతులు మొత్తం నీకు రావలసిన ధనంలోంచి మినహాయిస్తున్నాము.

నిన్ను యీనాటి నుంచి ఉద్యోగం లోంచి డిస్మిస్ చేస్తున్నాం. నీవు కూడబెట్టుకున్న ధనం మాత్రమే నీకు ముడుతుంది.

పెన్షన్ సదుపాయం ఉండదు."

నేరస్థుడు లేచి నిలబడ్డాడు ఒక్క క్షణం. తన యూనిఫారం వంక చూసుకున్నాడు. ఒక్కొక్క డెకరేషన్ తీసి తన ఎదుట ఉన్న ఆ బల్ల మీద పెట్టాడు.

వాటికి సెల్యూట్ చేశాడు. న్యాయాధిపతికి నమస్కరించాడు.

అంతా నిశ్శబ్దం - ఎవరూ మాట్లాడలేదు. నెమ్మదిగా బయటకు వెళ్ళిపోయాడు.

ఒంటరిగా అతను మిగిలాడు. అరగంట గడవకుండానే రావలసిన కాగితాలు వచ్చాయి. రావలసిన ధనం ముట్టింది.

పదవీ విరమణ పూర్తి అయింది. వీడ్కోలు, విందులు, సన్మానాలకు అక్కడ తావు లేదు.

అజ్ఞాతవాసం ప్రారంభమైంది.

వూరు వదిలి వస్తుంటే స్టేషను దాకా ఎవ్వరూ రాలేదు!

క్రొద్దిపాటి సామానులు. అవి తీసుకు వచ్చిన సివిలియన్ లారీ డ్రైవరు.

అనారోగ్యంతో బాధపడుతున్న యిల్లాలు... ఎక్కడి దండకారణ్యాం... ఎక్కడి కేరళ దేశం. సుఖంలేని ప్రయాణం!

ఈ దంపతులకు స్వగ్రామంలో కూడా ఆహ్వానం, ఆదరణ కరువైనాయి.

ఇంతకాలం వీళ్ళ యింట్లో అద్దె యివ్వకుండా, ఉచితంగా కాపురం ఉంటున్న బంధువులకు బాధగా ఉంది - ఖాళీ చేయమంటారేమో.

ఇంతకాలం వీళ్ళ పొలం కౌలుకి చేస్తూ- అడపా దడపా మాత్రం డబ్బు యిస్తూ, వీలుంటే యీ పొలం కాజేయాలని ఆశపడుతున్న రైతుకి వీళ్ళ రాకతో ఆశాభంగం కలిగింది.

వీళ్ళ అందరి మనస్సుల్లో ఆలోచన ఒకటే - ఈ దంపతులు యీ వూరు వదిలి పెట్టి వెళ్ళిపోతే బాగుండును.

పలుకరించని బంధువులు - తరిగి పోతున్న ధనం - గడిచిపోతున్న కాలం.

మీరు పదవీ విరమణ చేసిన వెంటనే - మా సంస్థలో చేరండి అన్న ఆహ్వానాలు లేవు.

ఉద్యోగం కోసం ఎక్కే గడప, దిగే గడప - మూడే మూడు సమాధానాలు- ఖాళీలు లేవు. మీ అర్హతలు మాకు చాలవు. ఇంత పెద్ద అర్హతలు ఉన్న వ్యక్తికి తగ్గ ఉద్యోగం మా దగ్గర లేదు.

ధైర్యం తగ్గింది. ఆత్మవిశ్వాసం సన్నగిల్లింది. మొగవాడు తనే, తనే యీ అవమానాన్ని, అపకారాన్ని తట్టుకోలేకపోతుంటే, అమాయకురాలు, అభిమాని - అ యిల్లాలు తట్టుకోలేకపోయింది. ఇంటా బయటా - అంతా చిమ్మచీకటులుగా ఉన్న తరుణంలో ఒకనాటి రాత్రి కట్టుకున్న వాడితో తన మాటగా చెప్పింది.

"పిల్లా జెల్లా లేనివాళ్ళం! ఎవ్వరికీ అక్కర్లేని వాళ్ళం, ఈ బ్రతుకుని పట్టుకుని వేళ్ళాడటం దేనికి?"

"ఏం చేద్దాం?"

"రేపు నదీగర్భంలో, పంచభూతాలలో కలిసిపోదాం."

గజేంద్రమోక్షం ఫోటో చూస్తున్న అతని మనస్సులో మసలిన మాట.

కలడు- కలండనెడి వాడు కలడో లేడో భార్య మాట వినగానే - చీకటులు దూరమై పోయాయి. మనస్సంతా వెన్నెల వెల్లువయింది. విషాదం తొలగింది. అంతులేని ధైర్యం కలిగింది.

చాలా రోజుల తర్వాత, ఆ రాత్రి ఆదమరచి నిద్దురపోయారు. ఉదయాద్రి తెలుపు అయింది. పక్షిగణం కలకలమని చెదిరింది. ఎవ్వరిదో కంఠం విని, ఆ దంపతుల కల చెదిరింది. నిదుర వదిలింది.

కుడి చెయ్యి అరచేతి వంక చూసుకున్నారు! దైవానికి నమస్కారం చేసి బయటకు వచ్చారు.

బయట యిద్దరు వ్యక్తులు నిలబడి ఉన్నారు. వారు ఆశ్రమ వాసులని చెప్పకుండానే తెలుస్తోంది. వారిని చూడగానే యీ దంపతులు అప్రయత్నంగానే సాష్టాంగ నమస్కారం చేశారు. సవినయంగా నిలబడ్డారు.

"మేము పరివ్రాజిక - పరమాచార్యుల వారి శిష్యులం. స్వామి వారి సందేశాన్ని తీసుకువచ్చాం."

"ఆజ్ఞాపించండి!!"

"మీ ఉభయులను ఆశ్రమానికి తీసుకుని రావలసింది అని పరమాచార్యులు వారి ఆదేశం. మీరు వెంటనే ప్రయాణానికి సిద్ధం కండి. సామానులు లారీలో వస్తాయి. మనం కారులో వెడదాము" అని ఆశ్రమవాసులు అన్నారు.

ప్రశాంతంగా ప్రవహిస్తున్న నదికి నమస్కరించి, కారు ఎక్కారు. ప్రయాణం సుఖంగా సాగింది.

ఆశ్రమం చేరగానే యీ దంపతులకు ఘన స్వాగతం లభించడమే కాదు, రాజ సమాన మర్యాదలు జరిగాయి.

సమ్ముఖానికి రావలసిందని కబురు వచ్చింది. అమ్మవారి పూజలో, పరవశులైన ఆచార్యుల వారి దర్శనం లభించింది. ఇసుక వేస్తే రాలనంత మంది జనం... వారి అందరి దృష్టి ఆచార్యుల వారి మీదనే.

ఎటు చూసినా, నిశ్శబ్దం, వినయం, కుతూహలం, స్వామి వారి అనుగ్రహ భాషణం, కోమల గాంధారంలో ప్రారంభమైంది.

"ఇది కలియుగం. మన క్షాత్రం, మన శౌర్యం, శిష్ట రక్షణ, ధర్మ రక్షణ కన్నా, ఒక దుర్మార్గుడు యింకొక దుర్మార్గుడికి అపకారం చేయకుండా అరికట్టడానికే వినియోగపడుతుంది.

అదే చాలా బాధాకరమైన విషయం.

కాని ధర్మ రక్షణ... క్షాత్ర ధర్మం... ధర్మాన్ని రక్షించిన రోజున, న్యాయం దానంతట అదే రక్షింపబడుతుంది! న్యాయం రక్షింపబడిన రోజున - శిష్ట రక్షణ - అప్రయత్నంగానే దానంతటదే జరుగుతుంది!

ధర్మం - న్యాయం - చట్టం, మానవత్వం - ఇవి నాలుగు విడివిడిగా విభిన్నంగా ఉండకుండా, ఒకటైన నాడు కలి యిక్కడ నిలువ లేదు. మళ్ళీ సత్యయుగం ప్రారంభ మవుతుంది!

ఈ పని మనకెందుకు, ఎవరో ఒకళ్ళు చేసుకుని పోతారు. ఇప్పుడు శ్రమ పడకుండా మనం కూడా లాభం పొందవచ్చునని - స్వార్థం కోసం మనుష్యులు బ్రతికే యీ కలికాలంలో -

ధర్మరక్షణలో - తమకు నష్టం కలిగినా, ఆ మహాయజ్ఞంలో తాము సర్వనాశనం అవుతామని తెలిసి కూడా భయపడకుండా - వెనుకాడకుండా ధర్మ రక్షణ చేసేవారు యీ రోజులలో కూడా ఉన్నారు కాబట్టే ధర్మం కనీసం నాలుగో పాదం మీద నైనా నిలబడగలుగుతోంది. అటువంటి వారిని గుర్తించి గౌరవించడం మన కనీస కర్తవ్యం!

ధర్మరక్షణలో తన సర్వస్వాన్ని పోగొట్టుకున్న వారి ఉదంతం యీ మధ్య మా ఎరుకకు వచ్చింది.

మన దేశంలో ఒక ప్రముఖ రాష్ట్రంలో ఒక సంపన్న నగరాన్ని యిద్దరు మిత్రులు ఆక్రమించుకున్నారు. రౌడీలుగా, బందిపోటు దొంగలుగా - దాదాలుగా- ఆ నగరాన్ని కొల్లగొట్టారు. దోచుకున్నారు. ప్రజల్ని భయభ్రాంతుల్ని చేశారు.

నియంతలు, నిరంకుశులై, చట్టానికి, న్యాయానికి అతీతులుగా మారి తామే న్యాయాధిపతులుగా - దండనాధులుగా మారి సగటు మనిషి బ్రతుకు దినదిన గండంగా మార్చి వేశారు.

మకుటం అక్కర్లేని చక్రవర్తులుగా బ్రతికారు.

ధర్మశాస్త్రం చెబుతుంది. మోక్షం వచ్చే దాకా పుణ్యాత్ముడు కష్టాలు పడతాడు. పాపం పండేదాకా దుర్మార్గుడు సుఖపడతాడు అని.

ఇక్కడ కూడా అదే జరిగింది. పాపం పండింది. పంపకాల దగ్గర తగాదా వచ్చింది. ప్రాణ మిత్రులు అనుకున్నవారు పరాయి వారు అయ్యారు.

నేనే యీ గడ్డ మీద బ్రతకాలి, మన శత్రువు పరలోకంలో బ్రతకాలి. ఇదే వారికి తెలిసిన చట్టం - న్యాయం - ధర్మం.

ఋణశేషం శత్రుశేషం ఉండరాదు. ఇది రాజనీతి!! శత్రుక్షయం చెయ్యాలి. వాయిదా వేయకూడదు! కాని పట్టపగలు పదిమంది చూస్తుండగా యీ పనులు జరుగవు కదా!

ఒక అర్ధరాత్రి వేళ నిశాచరులు సంచరించే వేళలో అయిన వారి చేతుల్లోనే ఒక జీవుడు బలవంతంగా పంచభూతాలలో కలిసిపోయాడు. ఈ వార్త కారుమబ్బు లాగా నాలుగు దిక్కులా వ్యాపించింది! తెల్లవారకుండానే దమనకాండ ప్రారంభ మైంది. ప్రతీకారం కోసం కాదు - పగ తీర్చుకోవడానికి కాదు - యీ నెపంగా అమాయకుల ఆస్తులు కొల్లగొట్టడం, దోచుకోవడానికి వీలు లేని దాన్ని ధ్వంసం చేయడం, అడ్డం వచ్చిన వారిని హతమార్చడం!

పరిస్థితి ఏనాడో చెయ్యిదాటి పోయింది. స్థానిక రక్షణ భటులకు అది అలవికాని పని అయింది.

మిలటరీ వారు రంగప్రవేశం చేసినా, కర్ఫ్యూ విధించినా యీ మారణ హోమం ఆగడం లేదు.

ఎటు చూసినా... భీభత్సం... భీతావహం! ఇంత గందరగోళంలోను, ఆ రైలు సకాలానికే ఆ స్టేషను చేరింది! ఆ రైల్లోంచి చాలామంది దిగారు. ఎవరికి వారే ప్రాణ భయంతో తలో దిక్కుకు పారిపోయి తలదాచుకున్నారు!

ఆ కుర్రాడు రైలు దిగి ఒక్కసారి నాలుగు దిక్కులా చూశాడు. ఎక్కడికి పారిపోలేదు. నెమ్మదిగా నడుచుకుంటూ వస్తున్నాడు. స్టేషన్ ప్లాట్‌ఫారమ్‌ను రక్షిస్తున్న మిలటరీ ఆఫీసరు దృష్టి ఆ కుర్రవాడి మీద పడింది.

ఉదయిస్తున్న బాల భాస్కరుడిలాగా ఉన్నాడు! మేలిమి బంగారం ఛాయ, ముఖంలో అంతులేని తేజస్సు! నడకలో ధైర్యం - కళ్ళలో ఆత్మవిశ్వాసం - స్థిత ప్రజ్ఞుడిలాగా ఉన్నాడు.

బయట జరుగుతున్న గందరగోళం అతనికి ఏమీ పట్టలేదు! సరాసరి వెళ్ళి ప్లాట్‌ఫారమ్ మీద ఉన్న కొళాయి దగ్గర స్నానం చేశాడు. సంచీలోంచి పట్టు పంచ తీసుకుని కట్టుకున్నాడు. తూర్పు దిక్కుగా కూర్చొని సంధ్యావందనం ప్రారంభించాడు.

బయట గందరగోళం ఎక్కువైంది. రౌడీలు, గుండాలు స్టేషనులోకి జొరబడుతున్నారు. మిలటరీ ఆఫీసరు ఒక్క క్షణంలో నిర్ణయం తీసుకున్నాడు.

'ఆ కుర్రవాడిని రక్షించండి' అని తన వారికి హుకుం జారీ చేశాడు. వారు అతని చుట్టూ వలయాకారంగా నిలబడి తుపాకులు గుండాల వైపు ఎక్కు పెట్టారు.

బయట విధ్వంసకాండ జరిగిపోతోంది. రావణ కాష్టం తగలబడిపోతోంది. మిలటరీ వాళ్ళు నిలుచున్న చోటు నుంచి కదలలేదు. ఆ పిల్లవాడిని కాపాడు తున్నారు. ఈ దృశ్యం పై అధికారి కంట పడింది.

"ఏం చేస్తున్నావు?" అంటూ గద్దించి అడిగాడు. 'ధర్మరక్షణ' అని సమాధానం వచ్చింది.

"నీ విధి ధర్మరక్షణ కాదు! బయట జరుగుతున్న విధ్వంసకాండని ఆపడం నీ కర్తవ్యం. అంతేకాని వందలాది జనం ఆపదలో ఉండి ఒక్కడి కోసం నీ పటాలాన్నీ యిక్కడ నిలపటం మూర్ఖత్వం. వెంటనే యిక్కడి నుంచి నీ వాళ్ళని తీసుకుని వెళ్ళి శాంతిభద్రతలను కాపాడు. అది నీ విధి. నీ ధర్మం" అంటూ ఆజ్ఞాపించాడు.

ఎన్నడూ పై అధికారులను ఎదిరించని వ్యక్తి ఆ క్షణంలో ఆ పిల్లవాడి వంక చూపిస్తూ...

"ఇంకా యిటువంటి వాళ్ళు ఉన్నారు కాబట్టే ధర్మం కనీసం ఒక్క పాదం మీదనన్నా నడుస్తోంది. నా విధి, నా కర్తవ్యం, నా ధర్మం ఇటువంటి వారికి రక్షణ కల్పించి - సురక్షితంగా వారి యింటికి చేర్చడం... అంతేకాని ఒక బందిపోటు దొంగని యింకొక దొంగ నుంచి కాపాడడం కాదు."

"ఈ తిరుగుబాటుకు శిక్ష ఏమిటో నీకు తెలుసుగా!"

"ఆ శిక్ష ఏదైనా సరే సంతోషంగా అనుభవిస్తాను."

అధికారి అక్కడ నుంచి వెళ్ళిపోయాడు. సంధ్యావందనం పూర్తి చేసుకుని సూర్యునికి అర్ఘ్యం ఇచ్చి ఆ కుర్రవాడు లేచి నిలబడి వీరి వంక చూశాడు.

ఎవ్వరూ అలా చెయ్యమని ఆజ్ఞ యివ్వలేదు. అధికారితో సహా సైనికులు అందరూ అతనికి సెల్యూట్ చేశారు.

అతడు వీరందరికి నమస్కరిస్తూ, "మీరు పెద్దవారు - నాకు శాల్యూట్ చేయకూడదు. పెద్దలు పిన్నలకు నమస్కారం చేస్తే చిన్నవారికి ఆయుక్షీణం అని అంటారు. మీరు నన్ను ఆశీర్వదించండి. నాకు శెలవు యిప్పించండి. నేను మా వూరు వెడతాను."

"రైళ్ళు, బస్సులు అన్నీ ఆపివేశారు. ఎల్లా వెడతావు? మీ వూరు ఎంత దూరం?" అని మిలటరీ ఆఫీసరు అడిగాడు.

అతను చిరునవ్వు నవ్వాడు. "రైళ్ళు, బస్సులు లేకపోతేనేమి? పదహారు కిలో మీటర్లేగా! విష్ణు సహస్రనామం పారాయణ చేసుకుంటూ వెళ్ళిపోతా. నాలుగు గంటలలో ఇంటికి చేరుకుంటాను."

ఆఫీసరు తన వారి వంక చూశాడు. వారందరి ఆలోచన ఒకటే. ఇది ఒక అపూర్వమైన సంఘటన. ఒక అద్భుతమైన అనుభవం. ఇటువంటి వారికి ఉపకారం చేస్తే మనం తరిస్తాము.

ఆఫీసరు - ఆ కుర్రవాడికి దగ్గరకు వచ్చి "బాబు నీ పేరేమిటి?" అని అడిగాడు.

"బాలసుబ్రహ్మణ్యం."

"మా బాల మురుగన్" అని ఆయన ఎంతో సంతోషించాడు.

"మీరు నడిచివెళ్ళవలసిన అవసరం లేదు. మా వ్యానులో వెళ్ళండి."

కుర్రవాడు వారికి నమస్కరించి మిలటరీ వ్యానులో వెళ్ళిపోయాడు.

తుఫాను వెలిసింది. కష్టలు కార్పణ్యాలు మరొక నాయకుడు పుట్టేదాకా నివురు గప్పిన నిప్పులు అయ్యాయి.

శాంతిభద్రతల బాధ్యత రాష్ట్రప్రభుత్వానికి అప్పచెప్పి పటాలం అడంగు చేరుకుంది.

అక్కడ పై అధికారులు సిద్ధంగా వున్నారు. ఆజ్ఞాధిక్కార నేరానికి - వారి చట్టాలకు - నిబంధనలు అనుసరించి విచారణ జరిగింది. ఒక వ్యక్తి రక్షణ కోసం అనేకమంది ప్రాణ రక్షణను నిర్లక్ష్యం చేసినందుకు, పై అధికారి ఆజ్ఞ దిక్కరించి నందుకు - గవర్నమెంటు వాహనాన్ని తన స్వంత పనికి వాడుకున్నందుకు దోషిగా నిర్ణయించారు.

పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం ప్రయోగించారు. ఫలితం అందరూ ఉండి కూడా ఎవ్వరూ లేనివాడు అయ్యాడు.

మనది ఆర్ష సాంప్రదాయం. ధర్మ రక్షణ - శిష్ట రక్షణ మన ప్రథమ కర్తవ్యమే కాదు. ప్రధాన కర్తవ్యం కూడా!!

ధర్మరక్షణ కోసం బద్ధకంకణులైన వారిని, దానికోసం స్వార్థరహితంగా పోరాడే వారిని, త్యాగాలు చేసేవారిని రక్షించడం, గౌరవించడం మన విద్యుక్త ధర్మం. ఈ మహాయజ్ఞంలో నా వంతు ఉడతాభక్తిగా ఒక మంచి పని చేద్దామని సంకల్పించాను. అందుకు ఆ రాజరాజేశ్వరి అమ్మవారి అంగీకారం కూడా లభించింది. ఆవిడ అనుగ్రహంతోనే నేను యీ పని చేస్తున్నాను.

ఈనాటి నుంచి యీ మిలటరీ ఆఫీసరు- శంకరంగారిని మన ఆశ్రమం ప్రధాన రక్షణాధికారిగా నియమిస్తున్నాను.

మిలటరీలో వారు పనిచేస్తున్నప్పుడు వారికి లభించే సదుపాయాలతోపాటు రెట్టింపు జీతం వస్తుంది. వయస్సుతో నిమిత్తం లేకుండా వారు యీ పనిని నిర్వహించవచ్చును.

విశ్రాంతి కావాలనుకున్నరోజున ఈ బాధ్యతలను యింకొకరికి అప్పచెప్పి మాతోబాటు మాలో ఒక్కరుగా, ఈ ఆశ్రమంలో వుండి శేషజీవితాన్ని గడపవచ్చును. స్వస్తి!"

పరమాచార్యుల వారి అనుగ్రహ భాషణం ముగిసింది.

ఆ మాటలు... శంకరానికి అమృతవర్షిణి అయింది. స్వాముల వారు చిరునవ్వుతో శంకరాన్ని ప్రశ్నించారు.

"కలడో లేడో అన్న సందేహం తీరిందా?" అని.

శంకరం దంపతుల ఆనందానికి అవధి లేదు. అంజలి ఘటించి వినయంగా సమాధానం చెప్పాడు.

"సందేహం తీరింది. భగవంతుడు ఉన్నాడు. నా ఎదుటనే మానవ రూపంలో" అంటూ సాష్టాంగ నమస్కారం చేశాడు.

అక్కడికి చాలా దూరంగా మారుమూల కుగ్రామంలో మధ్యాహ్నపు సంధ్యా వందనం పూర్తి చేసుకుని, సూర్యుడికి అర్ఘ్యం యిస్తున్న బాలసుబ్రమణ్యం మనస్సు అర్థం కాని ఆనందంతో కృతజ్ఞతతో నిండిపోయింది.

ఆలయంలో అమ్మవారి ముఖంలో సంతృప్తి కనిపించింది.